ఈ రోజు జరిగిన సిపిఐ(యం) ప్రెస్‌మీట్‌లో అంశాలను
ప్రచురణార్థం మీకు పంపుతున్నాము. - జె.ప్రభాకర్

తేది : 31.8.2018

రాష్ట్రంలో వామపక్షాలున, మైనార్టీలు, దళతులు, రైతులపైన తీవ్ర నిర్బంధం కొనసాగుతోందని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరితే అరెస్టులు చేసి రౌడీషీట్లు పెడుతున్నారని, దీనికి వ్యతిరేకంగా అన్ని ప్రతిపక్షాలతో సంప్రదించి అవసరమైతే రాష్ట్ర బంద్‌తో సహా ఆందోళనలు నిర్వహిస్తామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు తెలిపారు. శుక్రవారం విజయవాడలోని ఎంబివికెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ప్రతిఒక్కరిపైనా తెలుగుదేశం ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రౌడీషీట్లు పెడుతున్నారని, తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తున్నారని తెలిపారు. నారా హమారా సభలో ముస్లిం యువకులు నిరసన వ్యక్తం చేస్తే వారిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు పెట్టి జైల్లో పెట్టారని తెలిపారు. గుంటూరు ఎస్‌పి అధికారిలా కాకుండా రాజకీయనాయకుడిలా వ్యవహరిస్తున్నాడని అన్నారు. గతంలో గొట్టిపాడులో దళితులపై దాడి జరిగిన సమయంలోనూ లేని  సెక్షన్లు చేర్చి దళితులను అరెస్టు చేసి జైలుకు పంపించారని తెలిపారు. ముస్లిం యువకులపై గుంటూరు ఎస్‌పి చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని కోరారు. అధికారులు నిజాయితీగా వ్యవహరించాలని, రాజకీయ నాయకులుగా వ్యవహరించకూడదని ఆయన తెలిపారు. రాష్ట్రంలో టిడిపి పూర్తిగా దివాళా తీసిందని, ప్రజలు ఆ పార్టీకి దూరమవుతున్నారని అన్నారు. నాలుగేళ్లలో ఒక్కపని కూడా చేయలేదని, వీటిని కప్పి పుచ్చుకునేందుకే చంద్రబాబు అనేక ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. ఆస్పత్రుల్లో ఒకే బెడ్డుపై ఇద్దరు ముగ్గురు పడుకునే దుస్థితి రాష్ట్రంలో ఏర్పడిందని వాటిని పరిష్కరించడం లేదని తెలిపారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులతో ఐదు నెలల క్రితం చర్చలు జరిపిన ప్రభుత్వం వారంలో సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చిందని, ఇప్పటికీ నెరవేర్చకపోవడంతో ఆందోళనకు దిగితే వారిని ఎక్కడికక్కడ అరెస్టులు చేసి నిర్బంధం ప్రయోగించారని పేర్కొన్నారు. ఉండవల్లిలో తమ పొలాల్లో అనుమతి లేకుండా విద్యుత్ లైన్లు వేస్తున్నారని అడ్డుకున్న రైతులను అరెస్టు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్బంధాలకు వ్యతిరేకంగా అఖిలపక్ష సమావేశాలు నిర్వహిస్తామని చెప్పారు.

**అప్పుల కోసం అప్పులు**

చంద్రబాబు వైఫల్యాల నుండి బయటపడేందుకు అప్పులమీద అప్పులు చేస్తున్నారని, వాటిని ప్రజలపై రుద్దుతున్నారని తెలిపారు. అమరావతి బాండ్లు పేరుతో తీసుకొచ్చిన అప్పులు మరో అప్పు తీసుకునేందుకు ఈక్విటీగా పెట్టేందుకు చూస్తున్నారని తెలిపారు. ఇష్టారాజ్యంగా అప్పులు చేసి ప్రజలపై భారాలు వేస్తే చూస్తూ ఊరుకోబోమని తెలిపారు.

**సమస్యలపై జనసేనతో కలిసి పోరాడుతున్నాం**

రాష్ట్రంలో సిపిఎం, సిపిఐ, జనసేన కలిసి పోరాడుతున్నాయని, ఎన్నికల సమయంలో పొత్తుల గుర్తించి ఆలోచిస్తామని మధు తెలిపారు. ప్రజాసమస్యలపై ఆందోళనల విషయంలో నిరంతరం సంప్రదింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వామపక్షాలు నిర్వహించే పోరాటాలకు పవన్‌కళ్యాణ్ మద్దతిస్తున్నారు, వారు చేస్తున్న ఆందోళనలకు వామపక్షాలు మద్దతిస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని, దానికి అనుగుణంగా పనిచేస్తున్నామని తెలిపారు. జనసేనతో టిడిపి ఎమ్మెల్యేలు, మాజీలు సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలో దళతులపై దాడులు జరిగి నెలరోజులవుతున్నా ఇంతవరకు కేసు నమోదు చేయలేదని, అక్కడి పెత్తందారులు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు దాడులకు పాల్పడ్డారని తెలిపారు. దీనిపై తాను ఆ గ్రామంలో పర్యటిస్తున్నానని, అయితే పోలీసులు మాత్రం సిపిఎం నాయకులను గ్రామంలోకి రానివ్వబోమని ప్రకటించారని, అయినా తాము గ్రామంలోకి వెళతామని తెలిపారు.

**వరవరరావు అరెస్టు అప్రజాస్వామికం**

విరసం నేత వరవరరావు, మరికొందరిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. మోడీ ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులపై దాడి చేస్తోందని అన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తోందన్నారు.